యూటర్నే శరణ్యం!

- మరోమారు ఎమ్మెల్యే స్పష్టం
- ఆందోళనలో పాతబజార్‌వాసులు
- రాకపోకలు సాఫీగా సాగవన్న సందేహం
- సామాజిక మాధ్యమాల్లో చర్చకు దారితీసిన వైనం



వివాదాలకు నిలయమైన సిగ్నల్‌గడ్డ అంబేడ్కర్ చౌరస్తా

జడ్చర్ల టౌన్: నియోజకవర్గ కేంద్రం, మున్సిపాలిటీలో ప్రధాన ప్రాంతమైన పాతబజార్‌కు 167వ నెంబరు జాతీయ రహదారి నుంచి వెళ్లేందుకు రోడ్డు క్రాసింగ్ ఉన్నట్లా.. లేనట్లా అన్న అయోమయం పట్టణవాసుల్లో పెరుగుతుంది. తాజాగా శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి మరోమారు పాత బజార్‌కు యూటర్న్ మాత్రమే శరణ్యమని తేల్చేయడంతో పాతబజార్ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాతబజార్‌కు వెళ్లాలంటే యూటర్న్ ఒక్కటే కారణమన్నట్లుగా ఆయన చెప్పడంతో రాకపోకలు సాఫీగా సాగవన్న సందేహాలు పెరుగుతున్నాయి. దీనికితోడు జాతీయ రహదారుల శాఖ అధికారులు కూడా రోడ్డు క్రాసింగ్ విషయంలో సరైన స్పష్టత ఇవ్వకపోవడంతో సందేహాలకు మరింత ఊతమిస్తున్నాయి. సామాజిక మాధ్యమాల్లో చర్చకు దారి తీసింది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలిలా..

⇨ 167వ నెంబరు జాతీయ రహదారిపై మున్సిపాలిటీ పరిధిలోని 3, 12 వార్డుల్లో 750 మీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. నిర్మాణంలో భాగంగా నెహ్రూ చౌరస్తాలో 100మీటర్ల సర్కిల్ నిర్మిస్తున్నారు. రోడ్డు డిజైన్‌లో ఇప్పుడున్న అంబేడ్కర్ చౌరస్తాలో రోడ్డు క్రాసింగ్ ఉన్నప్పటికీ అధికారులు మాత్రం లేదని చెబుతున్నారు. దీంతో వివాదం మొదలై అఖిలపక్ష కమిటీ వేసేందుకు కారణమైంది. కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే, ఎంపీని కలిసి విన్నవించగా వారు వేర్వేరుగా జాతీయ రహదారుల శాఖ అధికారులకు రోడ్డు క్రాసింగ్ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. అందుకు తగినట్లుగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అయినప్పటికీ అధికారుల తీరులో ఎలాంటి మార్పు లేకుండా ఉంది.

ఎమ్మెల్యే ఏమన్నారంటే..

తాజాగా శనివారం ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో మాట్లాడుతూ.. పాతబజార్‌కు భారీ వాహనాలు రైల్వేబ్రిడ్జ్ దాటుకుంటూ వెళ్లి సర్కిల్‌లో యూటర్న్ తీసుకుని వెళ్లాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అందులో ఎలాంటి సందేహం లేదని ప్రకటించారు. తాను నిఖార్సయిన సర్టిఫికెట్లు కలిగిన విద్యావంతుడినని ప్రకటించుకున్నారు. గత ప్రభుత్వంలో డిజైన్ సక్రమంగా వేయకపోవడంతో పాతబజార్‌కు వాహనాలు వెళ్లేందుకు క్రాసింగ్ లేకుండా పోయిందని ఆరోపించారు. ఇప్పుడు డిజైన్ మార్పు సాధ్యంకాదని తేల్చారు.

మాజీమంత్రి ఇలా అంటున్నారు

పాతబజార్‌కు రాకపోకలు సాఫీగాసాగేలా రోడ్డు డిజైన్ ఉందని మ్యాప్ చూయిస్తూ కొద్దిరోజుల క్రితం మాజీ మంత్రి లక్ష్మారెడ్డి వెల్లడించారు. రోడ్డు పనులు పూర్తయ్యాక అందరికీ పూర్తి స్పష్టత వస్తుందని పలుమార్లు వెల్లడించారు. తనపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడుతున్నారు. అధికారంలో లేకపోయినప్పటికీ ఉన్న డిజైన్ ఎలా మార్చగలుగుతారని ప్రశ్నిస్తున్నారు. దీంతో తాజా, మాజీలు చేస్తున్న ప్రకటనలతో పట్టణవాసులు అయోమయంలో పడ్డారు.

విగ్రహాలు తరలిస్తేనే స్పష్టత

ప్రస్తుతం ఉన్న విగ్రహాలు తరలిస్తేనే రోడ్డు క్రాసింగ్‌పై స్పష్టత ఇవ్వగలుగుతామని జాతీయ రహదారుల శాఖ అధికారులు వెల్లడించారు. డిజైన్‌లో ఉన్నట్లుగా రోడ్డు పనులు చేస్తామని బదులిస్తున్నారు. అయితే భారీ వాహనాలు వెళ్లేందుకు మాత్రం యూటర్న్ తీసుకుని రావాల్సిందేనంటున్నారు.

సాఫీగా సాగించేలా చూడాలి



పాతబజార్‌కు ఇప్పుడున్నట్లుగానే వాహనాలు వచ్చిపోయేలా చర్యలు తీసుకోవాలి. అలా కానట్లయితే పాతబజార్‌కు తీరనినష్టం వాటిల్లుతుంది. ఇప్పటికే అన్ని రకాలుగా వెనకబడ్డ పాతబజార్ మరింత వెనకబడుతుంది. కొంచెం ప్లాన్ మార్చి భారీ వాహనాలు వచ్చేలా చేయగలిగితే అందరికీ ప్రయోజనంగా ఉంటుంది. ఎలాగైనా రోడ్డు క్రాసింగ్ అయ్యేలా రాకపోకలు సాగించేలా చేయాలి. అందుకు ఎమ్మెల్యే చొరవ చూపాలి.

– రమేశ్, కౌన్సిలర్, పాతబజార్, బాదేపల్లి 6వ వార్డు

స్థానికుల మనోభావాలకు అనుగుణంగా



పాతబజార్‌వాసుల మనోభావాలకు అనుగుణంగా భారీ వాహనాలు యథావిధిగా ఇప్పుడున్నట్లుగానే రాకపోకలు సాగించేలా ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలి. పాత బజార్‌కు భారీ వాహనాల రాకపోకల విషయంలో మాజీ ఎమ్మెల్యే ఒకలా, తాజా ఎమ్మెల్యే మరోలా చేసిన వాఖ్యలు అందరినీ గందరగోళంలో పడేశాయి. రాజకీయాలకు అతీతంగా ప్రాంత అభివృద్ధికి ఎలాగైనా డిజైన్ మార్చి రోడ్డు క్రాసింగ్ ఉండేలా చూడాలి.

– రంజిత్‌బాబు, బాదేపల్లి

సంక్షేమ హాస్టళ్లను పర్యవేక్షించాలి

- కలెక్టర్ విజయేందిర బోయి
- మూసాపేటలో ఇందిరమ్మ ఇళ్లు, ఎస్సీహాస్టల్, తహసీల్దార్ కార్యాలయం సందర్శన



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

అడ్డాకుల: విద్యార్థుల సంక్షేమ హాస్టళ్లను మండల అధికారులు తరుచూ పర్యవేక్షిస్తూ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించే విధంగా చూడాలని కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. మూసాపేట మండలంలో సోమవారం కలెక్టర్ పర్యటించి ఇందిరమ్మ ఇళ్లు, ఎస్సీ బాలుర హాస్టల్, తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఎస్సీ హాస్టల్‌లో వార్డెన్ ఆనంద్ అందుబాటులో లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ వార్డెన్ ఎందుకు రాలేదని జిల్లా అధికారులతో ఆరా తీశారు. విద్యార్థుల గదులను పరిశీలించారు. అనంతరం వంట గదిలో విద్యార్థుల కోసం సిద్ధం చేసిన ఆహారాన్ని పరిశీలించి నాణ్యతగా ఉండేలా వంట చేయాలని సిబ్బందికి సూచించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని చెప్పారు. హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్య ఎందుకు తక్కువగా ఉందని ప్రశ్నించారు. విద్యార్థులందరు చక్కగా చదువుకుని మంచి మార్కులను సాధించాలని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచేలా చొరవ తీసుకోవాలని కార్యదర్శి మహేందర్‌ను ఆదేశించారు. అంతకు ముందు నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. మంజూరైన ఇళ్లన్నీ నిర్మాణాలు మొదలు పెట్టేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని చెప్పారు. తర్వాత తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఇటీవల నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను పూర్తిగా పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను తిరస్కరించకుండా పరిష్కారం చేసేలా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజునాయక్, ఎంపీడీఓ కృష్ణయ్య, ఎంపీఓ అనురాధ, ఇన్‌చార్జి ఏపీఓ పులేందర్, కార్యదర్శి మహేందర్ తదితరులు ఉన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి



గూరకొండలో ఇంటింటికి బీజేపీలో పాల్గొన్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి

పాలమూరు/దేవరకద్ర: బీఆర్‌ఎస్ బాటలోనే కాంగ్రెస్ నడుస్తోందని, రెండు పార్టీలు కూడా దొందూదొందేనని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలపై సోమవారం జిల్లా కార్యాలయంలో ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందన్నారు. బీసీ రిజర్వేషన్స్ పేరుతో స్థానిక ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు లేక గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూ కేంద్రం ఇస్తున్న పథకాలను ప్రజల్లో ప్రచారం చేయాలన్నారు. స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్స్ ఖరారైన తర్వాత పార్టీ ఆదేశించిన అభ్యర్థులు పోటీ చేయాలన్నారు. జిల్లాలో అన్నిస్థానాల్లో గెలుపొందడానికి ఇప్పటి నుంచి ప్రయత్నాలు మొదలుపెట్టాలన్నారు. అలాగే దేవరకద్ర మండలంలోని గూరకొండలో మహా సంపర్క్ అభియాన్‌లో ఇంటింటికీ బీజేపీ, గడప గడపకు మోదీ పథకాల ప్రచారం నిర్వహించారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ బీజేపీ కన్వీనర్ డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కొండ ప్రశాంత్‌రెడ్డి, మండలాధ్యక్షుడు కృష్ణంరాజు, జిల్లా కార్యదర్శి నారాయణరెడ్డి ఇంటింటికి తిరిగి కేంద్రం ఇస్తున పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పవన్‌కుమార్, పద్మజారెడ్డి, బాలరాజు, పాండురంగారెడ్డి, రమేశ్, ప్రశాంత్‌రెడ్డి, దేవన్న సాగర్, కొండా వెంకటేశ్వర్‌రెడ్డి, గోవింద్‌దాసు, తిమ్మన్న, గోపాల్, విష్ణువర్ధన్, శ్రీశైలంచారి, శివకుమార్‌రెడ్డి, వెంకటేశ్, చెన్నప్ప, రాజు, కృష్ణ, బాలన్న తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే జీఎమ్మార్

చిన్నచింతకుంట: పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పేదలకు రేషన్‌కార్డులు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజాపాలన ప్రభుత్వం పేదప్రజల సంక్షేమానికి కృషిచేస్తుందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లు ఒక్క రేషన్‌కార్డు కూడా అందించలేదని మండిపడ్డారు. 18నెలలలో నియోజకవర్గంలో ఎన్నో కార్యక్రమాలు చేపట్టి నియోజకవర్గాన్ని అన్నివిధాల అభివృద్ధి పరుస్తున్నామన్నారు. అంతకుముందు అమ్మపూరం గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు దమగ్నాపురంలో ఎమ్మెల్యే నివాసంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, కురుమూర్తిస్వామి దేవస్థానం చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, కథలప్ప, బాలరాజు, తహసీల్దార్ ఎల్లయ్య, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మద్రాస్ ఐఐటీ స్కూల్ కనెక్ట్ ప్రోగ్రాంకు ఎంపిక



స్కూల్ కనెక్ట్ ప్రోగ్రాంకు ఎంపికైన విద్యార్థులు

జడ్చర్ల టౌన్: మద్రాస్ ఐఐటీ నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మకమైన స్కూల్ కనెక్ట్ ప్రోగ్రాంకు మండలంలోని కోడ్గల్ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థులు 8మంది ఎంపికైనట్లు హెచ్‌ఎం శ్రీనివాసులు తెలిపారు. ప్రోగ్రాం ద్వారా ఎంపికైన విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, డేటా సైన్స్ కోర్సులో చేరారని తెలిపారు. 8వారాలపాటు ఆన్‌లైన్‌లో కోర్సు కొనసాగుతుందని, ప్రతివారం వీడియోలు, లైవ్ ఇంటరాక్టివ్ సెషన్లు, అసైన్‌మెంట్లు, కంప్యూటర్ ఆధారిత పరీక్షలతో అనుభవసారమైన నైపుణ్యాభివృద్ధికి అనుగుణంగా శిక్షణ పొందుతారన్నారు. శిక్షణ పూర్తిచేసిన విద్యార్థులకు ఐఐటీ మద్రాస్‌లోని కోడ్ విభాగం నుంచి అధికారిక ధ్రువపత్రం లభిస్తుందన్నారు. ఉపాధ్యాయులు శశిధర్, మల్లికార్జున్ ప్రత్యేక చొరవ తీసుకుని విద్యార్థులను కోర్సులో చేర్పించినట్లు పేర్కొన్నారు. ప్రోగ్రాం సమన్వయకర్తగా గణిత ఉపాధ్యాయుడు శశిధర్ సింగిల్ పాయింట్ ఆఫ్ కాంట్రాక్ట్ ఐఐటీ మద్రాస్‌తో సమన్వయంతోపాటు స్కూల్ స్థాయిలో కార్యక్రమ నిర్వహణ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారన్నారు. ఇలాంటి అవకాశాన్ని అందించడంలో సహకరించిన రాష్ట్ర, జిల్లా విద్యాశాఖ అధికారితోపాటు ఐఐటీ మద్రాస్ బృందానికి పాఠశాల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

బీసీబిల్లుపై పార్లమెంటులో గళం విప్పాలి

మెట్టుగడ్డ: బీసీ రిజర్వేషన్ బిల్లుపై ఎంపీలు పార్లమెంట్‌లో గళం విప్పాలని బీసీ మేధావుల సంఘం జిల్లా కార్యదర్శి ప్రభాకర్ పేర్కొన్నారు. బీసీ బిల్లు సాధనకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద చేపట్టిన 72గంటల నిరాహారదీక్షకు బీసీ మేధావుల సంఘం, తెలంగాణ జాగృతి సంఘం సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ.. నాడు తెలంగాణ కోసం చేసిన పోరాటం ఒక ఎత్తయితే, ఇప్పుడు బీసీల కోసం చేస్తున్న పోరాటం మరో ఎత్తని, బీసీల కోసం గళం విప్పి పోరాడుతున్న కవితకు యావత్ బీసీల పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు.

కవిత దీక్షతో రాష్ట్ర ప్రభుత్వంలో చలనం

కవిత జేపట్టిన దీక్షకు తెలంగాణ జాగృతి మహబూబ్‌నగర్ పక్షాన సంపూర్ణ మద్దతు ఉంటుందని జిల్లా కన్వీనర్ వెంకటరామమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో గౌరీశంకర్, వల్లభదేవ్, కలాంబాషా, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో మెరుగైన సేవలకు కృషి



వెన్నాచేడ్‌లో గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి

గండేడ్: గ్రంథాలయాల్లో మెరుగైన సేవలందించేందుకు కృషిచేస్తామని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గండేడ్, వెన్నాచేడ్ గ్రంథాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాల్లో వసతులు, సిబ్బంది, పుస్తకాలు తదితర వాటిపై ఆరా తీశారు. వెన్నాచేడ్‌లో నీటి సౌకర్యం లేక టాయిలెట్లు వినియోగంలేదని, అలాగే పర్మనెంట్ సిబ్బంది లేక గ్రంథాలయాన్ని పూర్తిగా వినియోగించుకోలేకపోతున్నామని పలువురు చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో జిల్లావ్యాప్తంగా 14మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది నియామకానికి ప్రతిపాదనలు పంపామన్నారు. అనుమతులు రాగానే ఒక లైబ్రేరియన్‌ను నియమిస్తామన్నారు. అలాగే గ్రంథాలయంలో నీటి వసతి కల్పించాలని పంచాయతీ కార్యదర్శిని కోరామన్నారు. కనెక్షన్ ఇస్తే గ్రంథాలయంలో టాయిలెట్లు ఉపయోగంలోకి తీసుకురావచ్చన్నారు. పోటీపరీక్షలకు అవసరమైన పుస్తకాలు గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచుతామన్నారు. వీటితో మరిన్ని కొత్త పుస్తకాలు గ్రంథాలయాలకు అందించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ మనోజ్‌కుమార్, గ్రంథాలయ అకౌంటెంట్ మహేశ్ ఉన్నారు.

ఇందిరమ్మ లబ్ధిదారులకు మేలు చేకూర్చాలి

గండేడ్: ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు మేలు చేకూర్చేలా మేస్త్రీలు వ్యవహరించాలని ఎంపీడీఓ సత్యహరిశ్చంద్రారెడ్డి, తహసీల్దార్ మల్లికార్జున్‌రావు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, మేస్త్రీలతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాటాడారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ రవి, భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షుడు చెన్నయ్య, ఆయా గ్రామాల మేస్త్రీలు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల ప్రాముఖ్యత తెలుసుకోవాలి



పాలమూరు: తల్లిపాల ప్రాముఖ్యతను ప్రతి మహిళ, తల్లిదండ్రులు తెలుసుకోవాలని, పుట్టిన ప్రతి నవజాత శిశువుకు ముర్రుపాలను అరగంట వ్యవధిలో తాగించాలని జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ మాధవి అన్నారు. జనరల్ ఆస్పత్రిలోని ఎంసీహెచ్ భవనంలోని గైనిక్ విభాగంలో సోమవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. జనరల్ ఆస్పత్రిలోని గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిల్లలకు తల్లిపాలు ఇవ్వడంతో ఆరోగ్య సమస్యలు రావన్నారు. శిశువుకు మొదటి ఆరు నెలల ఆహారంగా తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, యాంటీబాడీస్ బిడ్డకు ఎలాంటి ఇన్ఫెక్షన్స్ రాకుండా కాపాడుతాయని తెలిపారు. తల్లిపాలలో ఉండే డీహెచ్‌ఏ, ఏఆర్‌ఏ వంటి ఫ్యాటీ యాసిడ్లు మెదడు దోహదానికి ఉపయోగపడుతాయని తెలిపారు. తల్లిపాలు ఇవ్వడం తల్లికి రొమ్ము క్యాన్సర్, గర్భాశయ సమస్యలు రావన్నారు. కార్యక్రమంలో గైనిక్ హెచ్‌వోడీ ప్రసన్న లక్ష్మి, ఆశాజ్యోతి, చిన్నపిల్లల వైద్యుడు రంజిత్‌కుమార్, డాక్టర్ ప్రేరణ, సునీత పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే బీసీలకు న్యాయం

స్టేషన్ మహబూబ్‌నగర్: బీసీలకు న్యాయం చేసేది కాంగ్రెస్ పార్టీయేనని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. బీసీలకు ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేపట్టి 42శాతం రిజర్వేషన్ల అమలుకు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించినట్లు తెలిపారు. బీసీ రిజర్వేషన్ల కోసం ఈనెల 6న ఢిల్లీలో జరిగే ధర్నాలో సీఎంతోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొంటున్నట్లు తెలిపారు. సీనియర్ నాయకుడు ఎస్.పీ.వెంకటేశ్ మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్లను అణగదొక్కడానికి బీజేపీ నాయకులు ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో ఆనంద్‌గౌడ్, చంద్రకుమార్‌గౌడ్, సీజే బెనహర్, బాలస్వామి, పీర్ సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

వేద సప్తాహం ప్రారంభం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సామాజిక మార్పుల కోసం వేద సప్తాహం నిర్వహించడం అభినందనీయమని మున్సిపల్ మాజీ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. సోమవారం స్థానిక బ్రహ్మణవాడిలోని ఆర్యసమాజ్ మందిరంలో వేద సప్తాహం ప్రారంభించి, హోమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హేతువు ద్వారా మార్గ నిర్దేశం, హిందూ ధర్మ పునాదుల కల్పనకు దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు సత్తూర్ చంద్రకుమార్‌గౌడ్‌తో పాటు దయానంద సరస్వతి పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీమా చేయించుకోవాలి

మహమ్మదాబాద్: ప్రతిఒక్కరూ జీవిత బీమా చేయించుకోవాలని ఎస్‌బీఐ ఆర్‌ఎం రామ్మూర్తి తెలిపారు. సోమవారం మండలంలోని ధర్మాపూర్‌కు చెందిన కావలి వెంకటయ్య ప్రమాదవశాత్తు చనిపోవడంతో నామినీగా ఉన్న భార్యకు ఎస్‌బీఐ మహమ్మదాబాద్ బ్యాంకు నుంచి రూ.20లక్షల బీమా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో అధికారులు బాలసుబ్రహ్మణ్యం, దీప్తిప్రియాంక, రవి, సంతోష్, ధనుంజయ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కంచె ధ్వంసంపై కేసు

నవాబుపేట: వ్యవసాయ పొలానికి వేసిన కంచెను ధంసం చేయండంతోపాటు పొలంలో దౌర్జన్యంగా ప్రవేశించిన వారిపై కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. మండలంలోని చౌడూర్‌కు చెందిన 340, 341 సర్వే నంబర్లలో ఉన్న 8ఎకరాల భూమిని గ్రామానికి చెందిన సుంకరి విద్యావతితో రెండునెలల క్రితం కొనుగోలు చేసినట్లు బాధితురాలు దాసరి సుశీల తెలిపారు. గతనెలలో పూర్తిగా కంచెను ఏర్పాటు చేసి చదును చేసి ఉంచి తాము హైదరాబాద్‌లో ఉండగా.. చౌడూర్‌కు చెందిన బిజ్జల చంద్రయ్యతోపాటు మరికొందరు ఆదివారం భూమిలోకి అక్రమంగా ప్రవేశించి, కంచెను ధ్వంసం చేసినట్లు బాధితురాలు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కంచెను ధంసం చేసిన చంద్రయ్యతోపాటు మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్లుప్తంగా

రంగనాయకస్వామి ఆలయ అభివృద్ధికి సహకారం

- మాజీ మంత్రి డా.లక్ష్మారెడ్డి



జడ్చర్ల టౌన్: బాదేపల్లి పెద్దగుట్ట రంగనాయకస్వామి ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని మాజీమంత్రి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన పెద్దగుట్టపై రంగనాయకస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు కాల్వరాంరెడ్డి స్వాగతం పలికారు. పూజల అనంతరం లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధి పార్టీలకతీతంగా జరగాలని, రంగనాయకుడి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలకు ఉండాలని ఆకాంక్షించారు.

కాసులిస్తేనే జనన ధ్రువీకరణ పత్రం!

- ఎంపీడీఓకు ఫిర్యాదు చేసిన బాధితుడు

నవాబుపేట: డబ్బులిస్తేనే జనన ధ్రువీకరణ ఇస్తానని పంచాయతీ కార్యదర్శి డిమాండ్ చేసినట్లు బాధితుడు సోమవారం మండల అధికారులకు ఫిర్యాదు చేశాడు. వివరాలిలా.. మండలంలోని సిద్దొటం పంచాయతీ కార్యదర్శికి గ్రామానికి చెందిన తిమ్మగళ్ల రమేశ్ తన కుమారుడు, కూతురు జనన ధ్రువపత్రాలకు దరఖాస్తు చేసుకున్నాడు. కార్యదర్శి రూ.15 వేలు డిమాండ్ చేసినట్లు బాధితుడు సోమవారం అధికారులకు ఫిర్యాదు చేశారు. అత్యవసరం కావడంతో రూ.10వేలు చెల్లించి ధ్రువపత్రాలు తీసుకున్నాడు. మిగతా రూ.5వేలు ఇవ్వాలంటూ రోజూ తీవ్ర వత్తిడి చేస్తుండడంతో ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక ఎంపీడీఓ జయరాంనాయక్‌కు ఫిర్యాదు చేశాడు. కాగా ఈ విషయంలో ఎంపీడీఓ సైతం ఫిర్యాదును వెంటనే డీఎల్‌పీఓకు పంపించినట్లు జిల్లా అధికారుల ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటామని వివరించారు.

ఎరువుల కొరత లేకుండా చూడాలి: సీపీఎం



మహబూబ్ నగర్ న్యూటౌన్: వర్షాకాల సీజన్‌లో రైతులకు ఎరువులు కొరత లేకుండా చూడాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు జయలక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతుల సమస్యలపై ప్రభుత్వం పట్టనట్లుగా వ్యవహరించడం సరికాదన్నారు. ఎరువుల కోసం రైతులు ఇబ్బందులు పడుతుంటే ఎరువుల నిల్వలు ఉంచాల్సింది పోయి పట్టించుకోకుండా కాలయాపన చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి రాములు, కార్యదర్శివర్గ సభ్యులు కిల్లె గోపాల్, నల్లవెల్లి కురుమూర్తి, పద్మ, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాలకేంద్రంలో ఔషధ మొక్కల దినోత్సవం

స్టేషన్ మహబూబ్‌నగర్: పతంజలి యోగా సమితి, భారత్ స్వాభిమాన్ ట్రస్ట్, యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బాలకేంద్రం ఆవరణలో సోమవారం ఔషధ మొక్కల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఆచార్య డాక్టర్ బాలకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకొని జడిబుటి దివస్ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పతంజలి యోగా సమి తి అధ్యక్షుడు గంగాధర్, యువభారత్ అధ్యక్షు డు సురేశ్, యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయికుమార్, రిటైర్డ్ తహసీల్దార్ శంకర్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలి

నవాబుపేట: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు వెంటనే నిర్మాణం పనులు ప్రారంభించాలని ఎంపీడీఓ జయరాంనాయక్ సూచించారు. సోమవారం ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఏఈ శ్రావణితో కలిసి మండల అధికారులు, పంచాయతీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఇల్లు నిర్మించని వారు వెంటనే పనులు ప్రారంభించాలని లేకుంటే వారికి మంజూరైన ఇల్లు రద్దయ్యే అవకాశం ఉంటుందని వివరించారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నగరపాలక సంస్థలోని అప్పన్నపల్లిలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద చేపట్టిన పారిశుద్ధ్య పనులను సోమవారం అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ (ఏఎంసీ) రాజన్న పరిశీలించారు. అలాగే పద్మావతికాలనీలోని అయ్యప్పకొండ మార్గంలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్లకంపను తొలగించే పనులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఇన్‌స్పెక్టర్ వజ్రకుమార్‌రెడ్డి, ఎస్‌బీఎం కన్సల్టెంట్ సుమీత్‌రాజ్ పాల్గొన్నారు.



సంక్షిప్తంగా..

జేపీఎన్‌సీలో వర్క్‌షాప్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జేపీఎన్‌సీ కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో వర్క్‌షాప్ ఆన్ స్టూడెంట్ రీడినెస్ ఫర్ కెరియర్ బిల్డింగ్ అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి హాజరై ప్రసంగించారు. విద్యార్థులకు వర్క్‌షాప్‌లతో ప్రయోజనం ఉంటుందని, నైపుణ్యాలు పెంచుకోవడంతో త్వరితగతిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్వేత, విఠల్, సిరాజుద్దీన్, కార్తికేయ, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

అధిక ధరలకు అమ్మితే చర్యలు

మహమ్మదాబాద్: రైతులకు ఎరువులు అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవని ఏఓ నరేందర్ తెలిపారు. సోమవారం మండలంలోని వెంకట్‌రెడ్డిపల్లి, మహమ్మదాబాద్‌లో పలు ఎరువుల దుకాణాల్లో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు కాకుండా అధిక ధరలకు ఎరువులు అమ్మితే ఆయా దుకాణాల యజమానులపై చర్యలు తప్పవని తెలిపారు. ఎరువుల యూరియా కొరత ఉన్నట్లు కొందరు కావాలని సృష్టిస్తున్నారని ఆరోపించారు. దుకాణాల యజమానులు స్టాక్‌రిజిష్టర్ తప్పకుండా రాయాలని, బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

నవాబుపేట: అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండేలా ప్రజలకు సూచించాలని.. అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఎంపీడీఓ జయరాంనాయక్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలో మండల అధికారులు, పంచాయతీ సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో నిత్యం పారిశుద్ధ్య కార్యక్రమాలు జరుగుతూనే ఉండాలన్నారు. ఉపాధి హామీ పథకానికి సంబంధించి సామాజిక తనిఖీకి కావాల్సిన రికార్డులు అందించాలన్నారు. సమావేశంలో ఎంఈఓ నాగ్యానాయక్, ఈఓపీఆర్డీ నసీర్‌అహ్మద్, ఏపీఓ జ్యోతి పాల్గొన్నారు.

లోకిరేవులో శ్రావణపూజలు

నవాబుపేట: మండలంలోని లోకిరేవులో శ్రావణ సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీరభద్రుడికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. శ్రావణ సోమవారం పైగా ఏకదశీ ముహుర్తం కావడంతో ప్రత్యేక రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

చిన్నచింతకుంట: కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని టీపీసీసీ జనరల్ కార్యదర్శి అరవింద్‌కుమార్‌రెడ్డి, కౌకుంట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం కౌకుంట్ల మండలంలోని ముచ్చింతల, అప్పంపల్లి రాజోలిలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కురుమూర్తి స్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కిషన్‌రావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు మహాసభ జిల్లా కన్వీనర్‌గా పురుషోత్తంరెడ్డి నియామకం

మెట్టుగడ్డ: తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ జిల్లా కన్వీనర్‌గా హన్వాడ మండల కేంద్రానికి చెందిన కొండా పురుషోత్తంరెడ్డి నియమితులయ్యారు. హైదరాబాద్ కాచిగూడ తెలంగాణ మున్నూరు కాపు మహాసభ కార్యాలయంలో సోమవారం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరావు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ రాష్ట్ర కమిటీకి ధన్యవాదాలు తెలియజేశారు.

గురుకులాల్లో నాణ్యమైన భోజనం పెట్టాలి

గండేడ్: గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని తహసీల్దార్ మల్లికార్జున్ అధికారులను ఆదేశించారు. సోమవారం మండలంలోని సల్కర్‌పేట్‌లోని మినీ గురుకుల స్కూల్‌ను ఎంఈఓ జనార్దన్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి వారు భోజనం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. గురుకులాల్లో చాలామంది పేదలు చదువుకుంటారని, వారికి ప్రభుత్వం ప్రకటించే నాణ్యమైన భోజనం పెట్టాలన్నారు. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులబారిన విద్యార్థులు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు.